సాక్షి కర్నూలు
మంగళవారం ‌: 16 ‌: ఏప్రిల్ ‌: 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణ పథకానికి సోమవారం భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన కొత్తపల్లి నాగలక్ష్మి రూ.1,01,116 విరాళాన్ని పర్యవేక్షకులు నాగరాజుకు అందజేశారు.



ఇన్సూరెన్స్ డబ్బుల కోసం దారుణం

ఇన్సూరెన్స్ డబ్బుల కోసం దారుణానికి పాల్పడిన ఓ వ్యాపారి, అతనికి సహకరించిన కుమారుడు జైలు పాలయ్యారు. ఈ కేసు మిస్టరీని పోలీసులు 15 రోజుల్లోనే ఛేదించారు. 8లో▸



వసూళ్లు.. పరవ'శిస్తు'

జిల్లాలోని మెజారిటీ గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లలో పురోగతి కనిపిస్తోంది. లక్ష్యం రూ.23.13 కోట్లు కాగా.. ఇప్పటి వరకు రూ.15.24 కోట్లు వసూలు చేశారు. 8లో▸

ఆధారమై..అభ్యున్నతికి నేస్తమై

- ప్రభుత్వ చర్యలతో రికార్డుస్థాయిలో చేనేత వస్త్రాల వ్యాపారం
- 2018-19లో రూ.2 కోట్లు మాత్రమే లావాదేవీలు
- 2023-24లో రూ.50 కోట్లకు పైగా అమ్మకాలు
- వైఎస్ఆర్ నేతన్న నేస్తంతో చేనేత కార్మికులకు ప్రోత్సాహం
- చేనేత పట్టుచీరలకు జాతీయస్థాయిలో గుర్తింపు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో చేనేత రంగం సరికొత్త రంగులను అద్దుకుంది. ఆధునిక హంగులతో మార్కెట్లో తన ఉనికిని చాటుకుంటోంది. ప్రత్యేక గుర్తింపుతో వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంది. టీడీపీ హయాంలో రూ.2 కోట్లు మాత్రమే ఉన్న లావాదేవీలు నేడు రూ. 50 కోట్లకు పెరగడంతో చేనేత కార్మికుల కుటుంబాల్లో హర్షం వ్యక్తమవుతోంది.



కర్నూలు(అగ్రికల్చర్): నాణ్యతకు, హుందాతనానికి, సృజనాత్మకతకు చేనేత వస్త్రాలు పెట్టింది పేరు. అయితే చంద్రబాబు ప్రభుత్వం వ్యవసాయంతో పాటు చేనేత రంగాన్ని కూడా విస్మరించింది. దీంతో చాలామంది చేనేత కార్మికులు కుటుంబం గడవడమే కష్టమై వృత్తి మార్చుకున్నారు. ఒకప్పుడు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 44 చేనేత సహకార సంఘాలు, 25వేలకుపైగా మగ్గాలు ఉండేవి. దాదాపు 15వేల కుటుంబాలు ఈ రంగంపై ఆధారపడి ఉపాధి పొందేవి. టీడీపీ హయాంలో చేనేత రంగం కుదేలై.. 2018 నాటికి ఉమ్మడి జిల్లాలో 11 వేల మగ్గాలు మాత్రమే ఉండేవి. చేనేత వ్యాపారం రూ.2 కోట్ల వరకు మాత్రమే ఉండేది. వైఎస్సార్‌సీపీ తీసుకున్న చర్యలతో మగ్గాల సంఖ్య 14,650కు పెరగగా.. వ్యాపారం పుంజుకుని రూ.50 కోట్లకు చేరుకుంది.

రూ.47.58 కోట్ల ఆర్థిక తోడ్పాటు

చేనేత పరిశ్రమ అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకానికి శ్రీకారం చుట్టారు. 2019-20 నుంచే ఈ పథకాన్ని అమలు చేశారు. నెలకు రూ.2000 ప్రకారం ఏడాదికి రూ.24,000 చొప్పున డీబీటీ ద్వారా నేరుగా చేనేతకారుల బ్యాంకు ఖాతాలకే విడుదల చేశారు. ఐదేళ్లలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో చేనేత కుటుంబాలకు రూ. 47.58 కోట్లు లబ్ధి చేకూరింది. కర్నూలు జిల్లాలో రూ.38.08 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.9.04 కోట్ల మేర చేనేత కార్మికులకు ప్రయోజనం లభించింది. ఈ పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4,148 కుటుంబాలకు ప్రయోజనం లభించింది. ఐదేళ్లలో ఒక్కో చేనేత కుటుంబానికి రూ.1.20 లక్షల ఆర్థిక తోడ్పాటు అందింది. ప్రభుత్వ చేయూతతో చేనేతకారుల్లో ఆత్మస్థైర్యం పెరిగింది.

పెరిగిన వ్యాపారం..

గద్వాల పట్టుచీరలంటే మగువలకు అమితమైన ఇష్టం. ఈ చీరలు ఉత్పత్తి అయ్యేది కర్నూలు జిల్లాలోనే. కోడుమూరు, ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో వందలాది మంది ఇళ్లలోనే మగ్గాలు ఏర్పరచుకొని ఈ చీరలను నేస్తున్నారు. కోడుమూరు ప్రాంతంలో 1,100 మంది, ఆదోని ప్రాంతంలో ఐదు వందల మంది, ఎమ్మిగనూరు ప్రాంతంలో 1,500 మంది పట్టుచీరలు తయారు చేస్తున్నారు. ఒక్కో చేనేత పట్టు చీర విలువ కనిష్టంగా రూ.8 వేలు, గరిష్టంగా రూ.30 వేల వరకు ఉంటుంది. జిల్లాలో ఏటా 75 వేల వరకు పట్టుచీరలు ఉత్పత్తి అవుతున్నాయి. 2023-24లో దాదాపు 50 వేల పట్టు చీరల అమ్మకాలు జరిగాయి. రూ. 50 కోట్లకు పైగా వ్యాపారం జరిగినట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వం తీసుకున్న చొరవతో జిల్లాలో కోడుమూరు కేంద్రంగా ఉత్పత్తి అవుతున్న పట్టుచీరలకు ఒక జిల్లా- ఒక ఉత్పత్తి కింద జాతీయ స్థాయి రజిత పతకం(కాంస్యం), జ్ఞాపిక, ప్రశంసాపత్రం లభించింది. 2024-25 సంవత్సరానికి ఒక జిల్లా- ఒక ఉత్పత్తి కింద ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం ఉత్పత్తి చేసిన చేనేత వస్త్రాలను జాతీయ స్థాయి అవార్డు కోసం పంపుతున్నట్లు తెలుస్తోంది.

క్లస్టర్ల ద్వారా అధునాతన మగ్గాలు

ఆదోని, ఎమ్మిగనూరు మండలాలు చేనేత వస్త్రాలకు ప్రసిద్ధి చెందాయి. ఈ ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేనేత క్లస్టర్లు ఏర్పాటు చేసి చేనేతకార్మికులకు అధునాతన సామాగ్రిని 90 శాతం సబ్సిడీపై పంపిణీ చేసింది. ఒక్కో క్లస్టరులో రూ.1.35 కోట్ల సబ్సిడీలతో అధునాతన పరికరాలు పంపిణీ చేయడంతో చేనేత పరిశ్రమ మరింత బలపడింది. మొదటి విడతలో ఎమ్మిగనూరు క్లస్టరులో రూ.44.58 లక్షలు, ఆదోని క్లస్టరులో రూ.45.98 లక్షల సబ్సిడీతో అధునాతన చేనేత పరికరాలు పంపిణీ చేశారు. సంప్రదాయ వస్త్రాల తయారీ స్థానంలో ఆధునాతన వస్త్రాల తయారీకి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ప్రత్యేక డిజైనర్లను కూడా ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వం తీసుకున్న చొరవ తీసుకోవడంతో చేనేత వస్త్రాల వ్యాపారం అభివృద్ధిలోకి వచ్చింది.





కర్నూలు జిల్లాలో ఉత్పత్తి అయిన చేనేత పట్టు చీరలు

2018-19 నుంచి చేనేత వస్త్రాల వ్యాపారం ఇలా ఉంది...

సంవత్సరం	వ్యాపారం విలువ (రూ.కోట్లలో)
2018-19	2.00
2019-20	18.66
2020-21	28.89
2021-22	36.72
2022-23	45.74
2023-24	50.34

నేతన్న నేస్తంతో నిలదొక్కుకున్నాం



మా గ్రామంలో 32 మగ్గాలు ఉన్నాయి. 80 కుటుంబాలు వృత్తిపై ఆధారపడి ఉన్నాయి. మాకు కూడా మగ్గాలు ఉన్నాయి. చంద్రబాబు పాలనలో చేనేతకు ఎలాంటి ప్రోత్సాహం లేదు. 2014-15 నుంచి 2018-19 వరకు చేనేత ఉత్పత్తుల అమ్మకాలు కేవలం రూ.లక్ష వరకే ఉన్నాయి. 2019-20 నుంచి ప్రభుత్వం ఇచ్చిన తోడ్పాటుతో 2023-24లో రూ.36 లక్షల వ్యాపారం జరిగింది. వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం చేనేత కార్మికులను నిలదొక్కుకునేలా చేసింది. ఈ పథకం కింద ఐదేళ్లలో ప్రతి చేనేత కుటుంబానికి రూ.1.20 లక్షల అందింది.

– మెటికల నారాయణ, నందివర్గం, నంద్యాల జిల్లా

చేనేత రంగానికి ఊపిరి పోశారు



గద్వాల పట్టుచీరలు ఉత్పత్తి అయ్యేది కోడుమూరులోనే. ఈ చీరలు ఇక్కడే నేస్తున్నారనే విషయం చాలా మందికి తెలియదు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కోడుమూరు పట్టుచీరలకు జాతీయ గుర్తింపు లభించింది. వైఎస్ఆర్ నేతన్న నేస్తం కింద ప్రతి ఏటా రూ.24 వేలు ఆర్థిక సాయం అందుతోంది. దీంతో ఉత్పాదకత పెరిగింది. నెలకు 5-6 వరకు పట్టుచీరలు తయారు చేస్తాం. రూ.15 వేల వరకు ఆదాయం వస్తోంది. కోడుమూరు పట్టుచీరల అమ్మకాలు మెరుగు అయ్యాయి. దీంతో చేతి నిండా పని లభిస్తోంది.

– ఎస్.బ్రహ్మేంద్ర, కోడుమూరు, కర్నూలు జిల్లా

న్యూస్‌రీల్

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి



గార్గేయపురం ప్రభుత్వ పాఠశాలలో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

కర్నూలు: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా సోమవారం గార్గేయపురం, పి.రుద్రవరం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఎస్పీ కృష్ణకాంత్ పరిశీలించారు. భద్రత ఏర్పాట్లపై పోలీసు అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేపట్టాలన్నారు. మే 13వ తేదీన ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసరెడ్డి, కర్నూలు తాలూకా ఎస్ఐ పీరయ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

399 మంది వలంటీర్ల రాజీనామా

కర్నూలు(అర్బన్): జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇప్పటి వరకు మొత్తం 399 మంది వలంటీర్లు రాజీనామా చేశారని జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ వరకు 264 మంది గ్రామ వలంటీర్లు తమ వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీన 135 మంది వలంటీర్లు రాజీనామా చేయగా, సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులు వారి రాజీనామాలను ఆమోదించారన్నారు. 15వ తేదీన రాజీనామా చేసిన వారిలో కోసిగి మండలంలో 46, కల్లూరు 38, మద్దికెర 03, తుగ్గలి 21, ఆదోని 16, కౌతాళం మండలంలో 11 మంది వలంటీర్లు ఉన్నారని సీఈఓ తెలిపారు.

ఫ్లైయింగ్ స్క్వాడ్ నోడల్ అధికారిగా శ్రీనివాస్

కర్నూలు(అగ్రికల్చర్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ ఫ్లైయింగ్ స్క్వాడ్ నోడల్ అధికారిగా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్‌లకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు సంబంధించిన నివేదికలు నోడల్ అధికారి ద్వారా జిల్లా ఎన్నికల అధికారికి వెళ్తాయి.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



కొండారెడ్డిబురుజు వద్ద డెమో నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కర్నూలు: అప్రమత్తత, అవగాహనతో అగ్నిప్రమాదాలను నివారించవచ్చునని అగ్నిమాపక శాఖ జిల్లా సహాయక అధికారి చిన్నబజారి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు కర్నూలు పట్టణంలోని సీక్యాంప్ సెంటర్, కొండారెడ్డిబురుజు, రాజ్‌విహార్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ అగ్నిప్రమాదాల నివారణపై డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఎఫ్ఓ చిన్నబజారి మాట్లాడుతూ వేసవి కాలంలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా సంభవించే అవకాశమున్నందున వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నరేష్ కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రతాప్, నాగేశ్వరరావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు ముగిసిన గడువు

కర్నూలు(సెంట్రల్): 2024 సార్వత్రిక ఎన్నికలు, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు నమోదుకు సోమవారంతో గడువు ముగిసింది. ఇప్పటి వరకు వచ్చిన నిర్దేశిత ఫారం-6, 8లను ఏప్రిల్ 26లోపు పరిష్కరించి సంబంధిత వ్యక్తులకు ఓటు హక్కును కల్పిస్తారు. 2023 ఏప్రిల్ 15 నుంచి ఇప్పటి వరకు ఓటు హక్కు నమోదు కోసం(ఫారం-6) 2,55,502 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇప్పటి వరకు 2,47,872 మందికి ఓటు హక్కు కల్పించారు. మిగిలిన 7,630 దరఖాస్తులు వారం రోజుల కింద నుంచి రావడంతో వాటిని ఏప్రిల్ 26లోపు పరిష్కరిస్తారు. అలాగే ఓటు మార్పు కోసం ఫారం-8 కింద ఏడాదిలో దాదాపు 36,612 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇప్పటికే 35,714 మంది అభ్యర్థనను పరిశీలించారు. వారం రోజుల కింద వచ్చిన 898 మంది దరఖాస్తులను ఏప్రిల్ 26లోపు పరిష్కరించి అర్హత మేరకు పరిష్కారం చూపుతారు.

బీజేపీతో జతకట్టిన టీడీపీని ఓడిద్దాం

- వైఎస్సార్‌సీపీ పాలనలో ముస్లింల అభివృద్ధి
- కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్



మాట్లాడుతున్న ఇంతియాజ్, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ

కర్నూలు (టౌన్): బీజేపీతో జతకట్టిన టీడీపీని ఓడిద్దామని వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఇంతియాజ్ పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలులోని జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఇలియాస్ అధ్యక్షతన మైనార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, మైనార్టీ విభాగం జోనల్ ఇంచార్జీ అబుబాకర్, పార్టీ సీనియర్ నాయకులు గడ్డం రామక్రిష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ముస్లింలను ఓటు బ్యాంకుగానే చూసిందన్నారు. ముస్లింల ఆర్థిక స్థితిగతులు ఏనాడు పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్ హయాంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. దీంతో ఎంతో మంది యువతీ, యువకులు ఉన్నత విద్య అభ్యసించారని, డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, కలెక్టర్లుగా సేవలు అందిస్తున్నారన్నారు. తండ్రి బాటలోనే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి పయనిస్తున్నారన్నారు. ఐదేళ్లలో ముస్లింల సంక్షేమానికి రూ. 23 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. జగనన్న పాలనలో ముస్లింలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారయణమ్మ మాట్లాడుతూ.. ఎన్నికల వేళ ముస్లింలంతా ఏకం కావాలన్నారు. ముస్లింలకు షాదీ తోఫా, మౌజన్లకు గౌరవ వేతనం వరకు ఎన్నో సంక్షేమ ఫలాలు అందించిన జగనన్నకు గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ విభాగం జోనల్ ఇంచార్జీ అబూబకర్, పార్టీ అధ్యక్షులు ఇలియాస్‌లు మాట్లాడుతూ.. గతంలో తెలుగుదేశం పార్టీ ముస్లింలకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని, ఈ ఎన్నికల్లో జగనన్న అత్యధికంగా ఏడుగురుకు అవకాశం కల్పించారన్నారు. నిన్నటి వరకు భారతీయ జనతాపార్టీని తిట్టిన తెలుగుదేశం పార్టీ వారితో పొత్తు పెట్టుకొని ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు. ముస్లింలంతా టీడీపీని ఇంటికి సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో క్లీన్‌స్వీప్ చేస్తాం





ఆస్పరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి కర్నూలు జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి, వైఎస్సార్‌సీపీ నేతలకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

- జగన్‌ను మరోసారి సీఎంగా చేసుకోవడానికి ప్రజలు సిద్ధం ఉన్నారు
- ఆస్పరిలో రామసుబ్బారెడ్డి, బీవై రామయ్య, బుసినె విరుపాక్షి ప్రచారం

ఆస్పరి: ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు ఎంపీ, 14 ఎమ్మెల్యేల స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచి క్లీన్‌స్వీప్ చేస్తారని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి కర్నూలు జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రిని చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఆలూరు నియోజకవర్గం నుంచి బుసినె విరూపాక్షి 50 వేల మేజార్టీతో గెలువడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆస్పరిలో సర్పంచ్ మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, బుసినె విరుపాక్షి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వారికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. జగన్‌పై ప్రజలు చూపిస్తున్న అభిమానాన్ని చూసి ఓర్వలేక పెత్తందార్లు కుట్ర పన్నారన్నారు. ముఖ్యమంత్రిపై దాడిని చంద్రబాబా నాయుడు, పవన్ కల్యాణ్ ఒక పక్క ఖండిస్తూనే గులకరాళ్లతో దాడి అని హేళన చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో రైతులకు, యువతకు ఎంతో మేలు జరిగిందన్నారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థతో అర్హులైన పేదవారందరికీ ప్రభుత్వ పథకాలు అందాయన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారిపోయాయన్నారు. రెండేళ్ల కరోనా కష్ట కాలంలో కూడా పేదలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచాడన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. దీంతో ఆయన జనసేన, బీజేపీతో జతకట్టారన్నారు. ఆలూరు నియోజకవర్గంలో వేదావతి, నగరడోణ ప్రాజెక్టులు పూర్తి చేసి సాగు, తాగు నీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ పరిశీలకుడు తెర్నేకల్లు సురేంద్రరెడ్డి, ఆస్పరి, దేవనకొండ జెడ్పీటీసీ సభ్యులు దొరబాబు, కిట్టు, నాయకులు సొమ్యరెడ్డి, శశికళ, మూలింటి రాఘవేంద్ర, కట్టెల గోవర్ధన, పెద్దయ్య, బసవరాజు, మారయ్య, సుంకుర రామాంజినేయులు, దత్తాత్రేయరెడ్డి, కేశవరెడ్డి, తిమ్మప్ప, లక్ష్మీనారాయణ, ప్రకాష్, మనోహర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, దుమ్మా నరసింహులు, ముని పాల్గొన్నారు.

మే 25 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): మే 25 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి సునీత సోమవారం తెలిపారు. ఫీజు చెల్లింపునకు ఈనెల 18 నుంచి 24వ తేదీ వ రకు గడువు ఉందన్నారు. మార్కులు తక్కువగా వచ్చిన విద్యార్థులు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఇదే తేదీలో ఫీజు చెల్లించాలని తెలిపారు. జవాబు పత్రాల ఒక్కొక్క పేపర్ రీ వెరిఫికేషన్‌కు రూ.1,300, రీకౌంటింగ్‌కు రూ.260 చెల్లించాలన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో అన్ని పేపర్లు ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇంప్రూమెంట్ కోసం రూ.550 పరీక్ష ఫీజుతో పాటు పేపర్‌కు రూ.160 చొప్పున చెల్లించాలన్నారు. మొదటి, రెండో సంవత్సరం ఇంప్రూవ్‌మెంట్ రాయాలనుకునే సైన్స్ విద్యార్థులు రూ.1,440, ఆర్ట్స్ విద్యార్థులు రూ.1,240 చొప్పున చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో విద్యార్థులు సంప్రదించాలని డీవీఈఓ తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

- నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచే నామినేషన్ల స్వీకరణ
- మే 2 నుంచి 5 వరకు పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల కేటాయింపు
- పోస్టల్ బ్యాలెట్‌కు 14 వేల దరఖాస్తులు
- రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన



కర్నూలు(సెంట్రల్): ఎన్నికలు ప్రశాంతవాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి. సృజన తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రాజకీయపార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం ఏప్రిల్ 18వ తేదీన నోటిఫికేషన్‌ను విడుదలవుతుందన్నారు. నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచే నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. నామినేషన్లను వేయడానికి వచ్చే అభ్యర్థుల వాహనాలను 200 మీటర్ల దూరంలోనే నిలిపి వేస్తామని, అభ్యర్థితోపాటు నలుగురు ప్రతిపాదకులను మాత్రమే అనుమతిస్తామన్నారు. పబ్లిక్ హాలిడేలు, ఆదివారం రోజున నామినేషన్లను స్వీకరించబోమన్నారు. ఈవీఎంలను అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు తరలించామని, మే 2 నుంచి 5వ తేదీ వరకు కమిషనింగ్ చేస్తామన్నారు. ఇందులో భాగంగా బ్యాలెట్ యూనిట్ మీద బ్యాలెట్ పేపర్లు అతికించడం, వీవీ ప్యాట్స్‌లో సింబళ్లను లోడ్ చేయడం, మరోసారి పనితీరును పరిశీలించి వాటిని పోలింగ్ కేంద్రాలకు కేటాయించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ ప్రక్రియలోకూడా రాజకీయ పార్టీలు ప్రాతినిధ్యం వహించాలన్నారు.

హోమ్ ఓటింగ్ దరఖాస్తుకు 21 వరకు అవకాశం

పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఈ ఏప్రిల్ 15వ తేదీతో గడువు ముగిసిందని, ఇప్పటి వరకు 14 వేల దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి. సృజన తెలిపారు. ఈసారి పోస్టల్ బ్యాలెట్ ఉద్యోగుల చేతికి ఇవ్వబోరని, పోస్టులో పంపించే పద్ధతి కూడా ఉండబోదన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఆర్‌ఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఫెసిలిటేషన్ కౌంటర్లలోనే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలన్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సుల్లో పనిచేసే వారికి మాత్రమే పోస్టు ద్వారా ఓటును పంపే విధానం అమల్లో ఉందన్నారు. హోమ్ ఓటింగ్‌కు సంబంధించి ఏప్రిల్ 18 నుంచి 21వ తేదీ వరకు బీఎల్‌ఓల ద్వారా దరఖాస్తులను సేకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో 60 సంవత్సరాలకుపైబడిన వారు, విభిన్నప్రతిభావంతులు, గర్భిణులు క్యూలో నిలబడకుండా త్వరితగతిన ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మే 10వ తేదీలోపు ఓటరు స్లిప్పులను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టరేట్‌లోని సీపీఓ కార్యాలయంలో ఎంసీఎంసీ సెల్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

మే 13న పోలింగ్ రోజున హెల్పర్లుగా విధులు నిర్వహించానుకుంటున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, మాజీ సైనికులు, రిటైర్డ్ పోలీసులు వారం రోజుల్లో పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఆమె సమావేశం నిర్వహించారు. రాజకీయాలకు సంబంధంలేని 15-16ఏళ్ల మధ్య వయసు ఉన్న ఎన్‌సీసీ క్యాడెట్లు ఇందుకుఅర్హులన్నారు. అలాగే ప్రైవేట్ సెక్యూరిటీ విధులు నిర్వహించే వారికి కూడా ఎన్నికల విధులు కేటాయిస్తామని, అయితే ముందుగా వారిపై పోలీసు శాఖకు ద్వారా విచారణ చేయిస్తామన్నారు. కేసులు, రాజకీయ పక్షపాతం లేని వారిని మాత్రమే ఎన్నిక చేస్తామన్నారు. ఎంపికైన హెల్పర్లు నడవలేని ఓటర్లను వీల్‌చైర్ల ద్వారా తీసుకురావడం, వృద్ధులకు సహాయ కారిగా ఉండడం తదితర పనులను చేయాల్సి ఉంటుందన్నారు. హెల్పర్లకు పారితోషికంతోపాటు భోజనాలు, వసతి సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

వసూళ్లు..పరవ‘శిస్తు’

- పన్నుల వసూళ్లలో పురోగతి
- వసూలు చేయాల్సింది రూ.23.13 కోట్లు
- ఇప్పటి వరకు వసూలైంది రూ.15.24 కోట్లు
- కోడుమూరు మండలంలో అధికంగా రూ.1.24 కోట్లు వసూలు



జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లలో పురోగతి కనిపిస్తోంది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో కొంత మందకొడిగా సాగినా, మార్చి నెలలో వసూళ్లు ఊపందుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పేద, మధ్య తరగతి వర్గాలకు వివిధ పథకాల ద్వారా అందుతున్న ఆర్థిక సహకారం ... తదితర కారణాలతో జిల్లాలోని మెజారిటీ గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్ల వేగం పెరిగింది. ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి నిర్ణయించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు చేపట్టిన చర్యల కృషి ఫలితంగా జిల్లాలోని 484 గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు పన్నులు, పన్నేతరముల కింద 66 శాతం వసూలయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే గ్రాంట్లకు అనుబంధంగా ... స్థానిక వనరులను సమీకరించుకోవడం, పన్నులు వసూలు చేయడంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందనే భావనతో మెజారిటీ పాలకవర్గాలు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాయి. అన్ని గ్రామ పంచాయతీల్లో పన్నులు, పన్నేతరములపై దృష్టి సారిస్తే ఆయా గ్రామ పంచాయతీ ఖాతాల్లో నిధులు జమ అయ్యే అవకాశాలు ఉంటాయనే అధికారులు చేసిన సూచనలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. పన్నుల వసూళ్లకు సంబంధించి డివిజన్ల వారీగా లక్ష్యాలను కేటాయించడం, పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్డీలకు ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించారు. అలాగే డీపీఓ కార్యాలయంలో ప్రత్యేకంగా ప్రతి రోజు పర్యవేక్షణ ఏర్పాటు చేయడం వల్ల పన్నుల వసూళ్లలో పురోగతి కనిపిస్తోంది.

ఇదీ ప్రగతి..

- ఆలూరు మండలంలో పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.43.11 లక్షలు కాగా, ఇప్పటి వరకు రూ.40.69 లక్షలు వసూలు చేశారు.
- మద్దికెర మండలంలో రూ.45.99 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.41.49 లక్షలు వసూలయ్యాయి.
- సీ బెళగల్ మండలంలో పన్నుల రూపంలో వసూలు చేయాల్సింది రూ.17.33 లక్షలు కాగా, ఇప్పటి వరకు రూ.15.48 లక్షలు వసూలయ్యాయి.
- కోడుమూరు మండలంలో పన్నేతరములకు సంబంధించి రూ. 1.30 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, ఈ నెల 4వ తేది వరకు రూ.1.24 కోట్లను వసూలు చేశారు.
- జిల్లాలోని మూడు మండలాల్లో పన్నేతరములకు సంబంధించి నూరు శాతం వసూళ్లు చేశారు. పెద్దకడుబూరు మండలంలో రూ.49,300, కృష్ణగిరిలో రూ.61,480, తుగ్గలిలో రూ.67,672 లు వసూలయ్యాయి. మిగిలిన మండలాలతో పోలిస్తే కోడుమూరు మండలంలో లక్ష్యం రూ.1,30,97,223 కాగా, ఇప్పటి వరకు రూ.1,24,28,560 వసూలు చేశారు.

క్షేత్ర స్థాయిలో దృష్టి సారించాల్సి ఉంది

గ్రామ పంచాయతీలకు ఆదాయాన్ని పెంచుకునే అంశంలో క్షేత్ర స్థాయిలో ఉన్న అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అనేక గ్రామ పంచాయతీల్లో దశాబ్దం క్రితం ఉన్న ఇళ్ల సంఖ్యనే నేటికి లెక్కల్లో చూపుతున్నారు. జిల్లాలోని 484 గ్రామ పంచాయతీల్లో దాదాపు 50 శాతం గ్రామ పంచాయతీలు భౌగోళికంగా విస్తీర్ణం చెందాయి. ఈ నేపథ్యంలోనే ఆయా గ్రామ పంచాయతీల్లో కొత్త కాలనీలు ఏర్పాటు అయ్యాయి. అయితే కొత్తగా గ్రామ శివారుల్లో ఏర్పాటవుతున్న కాలనీలు, కొత్త ఇళ్లపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేకపోవడం వల్ల ఆయా గ్రామ పంచాయతీలు ప్రత్యక్షంగా పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని కోల్పోతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

ఏప్రిల్ 1వ తేది నాటికి వసూలు లక్ష్యం (అరియర్స్‌తో కలిపి): రూ.23.13 కోట్లు

వసూలు చేయాల్సింది ...		వసూలు చేసింది ...	
పన్నులు:	రూ.14,24,88,193	పన్నులు:	రూ.9,47,34,460
పన్నేతరములు:	రూ 8,88,52,528	పన్నేతరములు:	రూ 5,77,43,808
మొత్తం:	రూ. 23,13,40,721	మొత్తం:	రూ. 15,24,78,268

జిల్లాలో మొత్తం గ్రామ పంచాయతీలు	మేజర్ గ్రామ పంచాయతీలు	మైనర్ గ్రామ పంచాయతీలు
484	16	468

క్లుప్తంగా

108లో గర్భిణి ప్రసవం



అంబులెన్స్‌లో ప్రసవించిన బిడ్డను చూపుతున్న 108 సిబ్బంది

గడివేముల: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. 108 సిబ్బంది రమేష్, నయోమి తెలిపిన వివరాల మేరకు.... మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామానికి చెందిన కరిష్మా పురిటి నొప్పులు రావడంతో ఆదివారం రాత్రి అంబులెన్స్ సిబ్బందికి ఫోన్ చేశారు. స్పందించిన 108 సిబ్బంది బిలకలగూడూరు గ్రామానికి చేరుకుని గడివేముల సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అక్కడ నుంచి మిడ్తూరు సీహెచ్‌సీకి రెఫర్ చేయగా తలముడిపి సమీపంలో వెళ్తుండగా మగబిడ్డకు ఆమె జన్మించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. మెరుగైన వైద్యం కోసం తలముడిపి ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. సకాలంలో తగిన సహకారం అందించిన గర్భిణీ కాన్పునకు కృషిచేసిన 108 సిబ్బందికి ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు లారీల సీజ్

కర్నూలు (న్యూటౌన్): ప్రకాశం జిల్లా ఒంగోలులోని బుదవాడ నుంచి కర్ణాటక రాష్ట్రానికి రెండు లారీల్లో అక్రమంగా రవాణా చేస్తున్న గెల్యాక్సీ గ్రానెట్ స్లాబ్స్‌ను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ సోమవారం విలేకరులకు తెలిపారు. రెండు లారీలను కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఉంచినట్లు చెప్పారు. ఒక లారీకి సంబంధించి యజమాని నుంచి రూ.3.20లక్షలు, మరో లారీకి సంబంధించిన యజమాని నుంచి రూ.3.21 లక్షలు అపరాధ రుసుం విధించామని వసూలు చేశామని పేర్కొన్నారు.


టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా తిక్కారెడ్డి

కర్నూలు: టీడీపీ కర్నూలు పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షుడిగా ఉన్న బిటీ నాయుడు స్థానంలో మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డిని ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు ఆయన సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. బీటీ నాయుడును కర్నూలు నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్తగా నియమించారు. అలాగే కోడుమూరు అసెంబ్లీ టిక్కెట్‌ను ఆశించి భంగపడ్డ ఆకెపోగు ప్రభాకర్‌ను కర్నూలు పార్లమెంటు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో ఆయన కూడా బాధ్యతలు చేపట్టారు. ఇకపోతే ఆదోని అసెంబ్లీ టిక్కెట్‌ను ఆశించి భంగపడిన మీనాక్షి నాయుడుకు కూడా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని కట్టబెట్టి మమ అనిపించడం గమనార్హం.

ఆశాజనకంగా ఎండు మిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. సోమవారం యార్డులో సూపర్-10 రకం జనరల్ క్వింటాలు గరిష్ట ధర రూ.15,100, మధ్యస్థ ధర రూ.12,000, కనిష్ట ధర రూ.8,000గా నమోదైంది. ఇదే రకం తాలుకాయ జనరల్ గరిష్ట ధర క్వింటాలు రూ.5,000, మధ్యస్థ ధర రూ.4,500, కనిష్ట ధర రూ.4,000గా పలికినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. అన్నదాతలు దళారులను నమ్మి మోసపోకుండా యార్డులోని ధ్రువీకృత వ్యాపారస్తుల వద్ద సరకు అమ్ముకొని మంచి ధరను పొందాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన మహేష్

పాములపాడు: మండల కేంద్రంలోని ఎస్ఎంసీ కాలువ వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెలిమిల్ల గ్రామానికి చెందిన మహేష్ (24) బైక్‌పై పాములపాడుకు బయలుదేరాడు. నేషనల్ హైవే పనులకు మట్టిని తరలిస్తున్న టిప్పర్ ప్రమాదవశాత్తూ వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి కింద పడిన మహేష్ కాళ్లపై టిప్పర్ టైర్లు వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కర్నూలు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి శివన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

మహానందిలో రేపు శ్రీరామనవమి వేడుకలు

మహానంది: చైత్రమాసం, నవమి, పునర్వసు పురస్కరించుకుని బుధవారం మహానందిలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల మధ్యలో అభిజిత్ లగ్నంలో సీతారాముల వారికి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. సాయంత్రం సీతారాముల వారికి హనుమద్వాహనంపై గ్రామోత్సవం ఉంటుందని చెప్పారు. భక్తులు హాజరై రామానుగ్రహం పొందాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా వెండి రథోత్సవం



స్వామిఅమ్మవార్లకు వెండిరథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైలమహాక్షేత్రమైన శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం వెండి రథోత్సవాన్ని నిర్వహించింది. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మ వార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథం ఉంచిఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

ఇన్సూరెన్స్ డబ్బుల కోసం దారుణం

- మద్యం మత్తులో ఉన్న వ్యక్తిని హత్య చేసి నిప్పుపెట్టిన వైనం
- అగ్ని ప్రమాదంలో తాను చనిపోయినట్లు నమ్మించే ప్రయత్నం చేసిన ఇన్సూరెన్స్‌దారుడు
- 15 రోజుల్లో కేసును ఛేదించిన పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న నంద్యాల అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్

ఆత్మకూరు: అగ్ని ప్రమాదంలో తాను చనిపోయినట్లు గ్రామంలో అందరినీ నమ్మించాడు. ఎవరికీ అనుమానం రాకుండా మారు వేషంలో ఊర్లు మారుతూ గడిపాడు. సంబంధం లేని ఓ వ్యక్తిని హత్య చేసి ఏమి ఎరుగనట్టు వ్యవహరించాడు. కానీ కథ అడ్డం తిరిగింది. చివరకు నిజం బయట పడింది. ఇన్సూరెన్స్ డబ్బుల కోసం దారుణానికి పాల్పడిన ఓ వ్యాపారి చివరకు కటకటాలపాలయ్యాడు. అతనికి సహకరించిన కుమారుడు కూడా జైలుకెళ్లాడు. జిల్లాలో సంచలనం సృష్టించిన వ్యక్తి సజీవ దహనం మిస్టరీ కేసును పోలీసులు 15 రోజుల్లోనే ఛేదించారు. దారుణానికి పాల్పడిన తండ్రీకొడుకులను అరెస్ట్ చేశారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. మండల కేంద్రమైన పాములపాడులో ఈనెల 1వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో నల్లగట్టు శ్రీనివాసులశెట్టి కాంప్లెక్స్‌లో షేక్ ఫరూక్‌బాషాకు చెందిన ఏకే ట్రేడర్స్ గోనెసంచుల షాపులో మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు మంటలను ఆర్పగా అందులో ఓ వ్యక్తి మృత దేహం కనిపించింది. అయితే షాపు యజమాని ఫరూక్ బాషాదిగా కుటుంబీకులు అందరినీ నమ్మించారు. ముస్లిం శ్మశాన వాటికలో మృతదేహాన్ని ఖననం చేశారు.

అప్పుల పాలై.. హత్యకు పాల్పడి..

ఏకే ట్రేడర్స్ షాపు యజమాని ఫరూక్‌బాషా, అతడి కుమారుడు అక్బర్‌బాషాకు వ్యాపారంలో నష్టాలు వచ్చాయి. రూ.కోటి వరకు అప్పులయ్యాయి. ఎల్ఐసీ ఇన్సూరెన్స్ రూ. కోటి వస్తుందని, దీంతో నష్టాల నుంచి బయట పడేందుకు దారుణానికి పాల్పడ్డారు. ఈనెల 1వ తేదీన రాత్రి పది గంటల సమయంలో మద్యం మత్తులో ఉన్న చెలిమెళ్ల గ్రామానికి చెందిన శెట్టిప్రతాప్‌ను దుకాణంలోకి లాగి గొంతుకు తాడు బిగించి చంపేశారు. ఆ తర్వాత దుకాణంలో గోనెసంచులపై పెట్రోల్ పోసి మృతదేహాన్ని అందులో పడేసి నిప్పు పెట్టారు. కాగా అగ్ని ప్రమాదంలో తాను చనిపోయినట్లు నమ్మించేందుకు చెప్పులు, దుస్తులు అక్కడే ఉంచి ఫరూక్‌బాషా పరారయ్యాడు.

వెలుగులోకి ఇలా..

ఈ సంఘటన జరిగిన ఐదు రోజుల తర్వాత ఈనెల 5వ తేదీన చెలిమెళ్ల గ్రామానికి చెందిన శెట్టిప్రతాప్ భార్య స్వరూప తన భర్త కనిపించడం లేదని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఏకే ట్రేడర్స్ దుకాణంలో చనిపోయింది తన భర్తేనని అనుమానం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఈ కేసు దర్యాప్తు ప్రత్యేక అధికారిగా ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్‌ను ఎస్పీ రఘువీర్‌రెడ్డి నియమించారు. ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేసును చేధించారు. ఫరూక్ బాషా కుమారుడు అక్బర్‌బాషాను అదుపులోకి తీసుకుని విచారించగా శెట్టి ప్రతాప్ హత్య వెలుగులోకి వచ్చింది. రూ.కోటి బీమా ఇన్సూరెన్స్ వస్తుందని ఆశపడి శెట్టి ప్రతాప్‌కు మద్యం తాగించి హత్య చేసి మృతదేహానికి నిప్పు పెట్టినట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు ఫరూక్ బాష, అక్బర్‌బాషాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ చాటిన సీఐ నాగభూషణ్, పాములపాడు ఎస్ఐ అశోక్‌కుమార్‌ను ఆయన అభినందించారు.

‘ఉద్యాన’ వికాసం

- ఐదేళ్లలో 23,449 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధి



సాగులో ఉన్న డ్రాగన్‌ఫ్రూట్ తోట

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనా కాలంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 23,449 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చెందాయి. ప్రభుత్వ ప్రోత్సాహంతో జిల్లా పండ్లతోటల హబ్‌గా మారుతోంది. టీడీపీ హయాంలో ఉద్యాన రైతులను పట్టించుకోలేదు. అప్పట్లో కేవలం 8,500 ఎకరాల్లోనే పండ్లతోటలు అభివృద్ధి చెందాయి. వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి మూడు రెట్లయ్యింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన రైతులకు 100 శాతం సబ్సిడీ ఇస్తున్నారు.ఎస్సీ, ఎస్టీ రైతులతో పాటు చిన్న, సన్నకారు రైతులకు స్థిరాస్తి కల్పిస్తున్నారు. అంతేగాక ఉద్యాన శాఖ పండ్లతోటల విస్తరణ పథకం కింద 40 శాతం సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది.

అన్ని రకాల పండ్ల తోటలు..

ఉపాధి హామీ కింద రైతులకు అన్ని రకాల పండ్లతోటలను అభివృద్ధి చేసుకునే అవకాశం లభించింది. మామిడి, బత్తాయి. నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, చింత, ఆపిల్‌బేర్(రేగు), డ్రాగన్‌ఫ్రూట్స్, అంజూర, పూలతోటలకు సంబంధించి గులాబీ, మల్లె తోటలు అభివృద్ధి చేసుకున్నారు. మూడేళ్లుగా మునగ సాగుకు సబ్సిడీలు ఇస్తుండటంతో జిల్లాలో సాగు జోరుగా ఉంటోంది.

డ్రైల్యాండ్ హార్టికల్చర్‌కు అవకాశం

రైతులు తమ పొలం పరిసరాల్లో చెరువు, కాలువ, డగౌటు పాండ్, ఇతర నీటి సదుపాయం ఉన్నా.. పండ్లతోటలు అభివృద్ధి చేసుకున్నారు. దీనినే డ్రైల్యాండ్ హార్టికల్చర్‌గా వ్యవహరిస్తారు. సాధారణంగా చౌడు నేలలను పనికి రాని వాటిగా వ్యవహరిస్తారు. ఉపాధి కింద చౌడు నేలల్లోను సీతాఫలం, నేరెడు, జామ, సపోట వంటి మొక్కలు నాటుకొని పండ్లతోటలు అభివృద్ధి చేసుకున్నారు.

ఐదేళ్లలో ఎంతో ప్రగతి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పండ్లతోటల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చింది. టీడీపీ హయాంలో ఉపాధి నిధులు కొల్లగొట్టే విధంగా చెక్‌డ్యామ్‌లకు ప్రాధాన్యత ఇచ్చారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం రికార్డు స్థాయిలో ఉపాధి నిధులతో 19,249 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేసింది. 10,377 మంది ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు స్థిరాస్తిని ఇచ్చింది. మరోవైపు ఉద్యాన శాఖ ద్వారా 40 శాతం సబ్సిడీతో మరో 4,200 ఎకరాల్లో వివిధ తోటలు అభివృద్ధి చెందాయి. మొత్తంగా 23,449 ఎకరాల్లో రైతులు వివిధ తోటలను అభివృద్ధి చేసుకున్నారు. ఇందులో జిల్లా పశ్చిమ ప్రాంతంలోనే 80 శాతం వరకు తోటలు ఉండటం విశేషం. దీంతో ఈ ప్రాంత రైతుల జీవన ప్రమాణాలు పెరిగి వలసలు తగ్గుముఖం పట్టాయి. టీడీపీ హయాంతో పోల్చి చూస్తే ప్రస్తుతం వలసలు 85 శాతం తగ్గిపోవడం విశేషం.

గాయపడిన వీఆర్వో మృతి

కర్నూలు (సిటీ): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ కోలుకోలేక పి.రుద్రవరం, నందనపల్లి వీఆర్వో బాబురావు(50) సోమవారం మృతి చెందారు. రంజాన్ పండుగ రోజున స్వగ్రామం పంచలింగాల నుంచి కర్నూలు నగరంలోకి వస్తుండగా జాతీయ రహదారిపై సంతోష్ నగర్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో చేర్పించి చికిత్స అందిస్తుండగా గాయాల నుంచి కోలుకోలేక మృతిచెందారు. విషయం తెలిసిన వీఆర్వోలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది హాస్పిటల్‌కు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. మంగళవారం యన స్వగ్రామం పంచలింగాలలో దహన సంస్కారాలు నిర్వహించనున్నారు. మృతిచెందిన వీఆర్వోకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

రాజంపేట: అన్నమయ్య జిల్లా రాజంపేటలోని ఏఐటీఎస్ ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థిని రేణుకా మహంక్(20) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకుని నంద్యాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు ప్రసాదరావు, భాగ్యలక్ష్మి కన్నీటిపర్యంతమయ్యారు. ఈ విషయంపై సీఐ రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నామన్నారు.

తుస్సుమన్న బాలయ్య బస్సు యాత్ర

- కర్నూలు, నందికొట్కూరులో ఫ్లాప్ షో

కర్నూలు/నందికొట్కూరు: సినీహీరో, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ బస్సుయాత్రకు సోమవారం కర్నూలు, నందికొట్కూరులో స్పందన కరువైంది. కర్నూలులోని చిన్నమ్మ వారిశాల నుంచి మౌర్యాఇన్ హోటల్ వరకు రోడ్‌షో నిర్వహించగా జనాలు పెద్దగా కనిపించలేదు. కొండారెడ్డిబురుజు దగ్గర ప్రజలనుద్దేశించి మాట్లాడేందుకు ప్రారంభించగానే మైకులు పనిచేయలేదు. మైకులను సరిచేసినా.. బాలకృష్ణ మాటలు అర్థం కాక ప్రారంభంలోనే జనం వెనుదిరిగారు. ముస్లింలను ఆకట్టుకునేందుకు ఉర్దూలో మాట్లాడేందుకు ప్రయత్నించి నోరు తిరగక బాలకృష్ణ తడబడ్డారు. జనాలకు అర్థం కాకపోవడంతో మళ్లీ తెలుగులో మాట్లాడారు. బాలకృష్ణ ప్రసంగం రొటీన్‌గా సాగడంతో ప్రజల నుంచి స్పందన లభించలేదు. నందికొట్కూరులో బాలయ్య తడబడుతూ ప్రసంగించడంతో అభిమానులు, ప్రజలు విసుగుచెంది ఇంటిబాట పట్టారు. బాలకృష్ణకు ఆహ్వానం చెబుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో టీడీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి ఫొటో లేకపోవడంతో ఆమె అభిమానులు ఆందోళన నిర్వహించారు. మాండ్ర శివానందరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

‘ఊరిమర్లు’కు ఉత్తమ కథా పురస్కారం



కర్నూలు కల్చరల్: జిల్లాకు చెందిన కథా రచయిత మారుతీ పౌరోహితం రాసిన ఊరిమర్లు కథా సంపుటికి హిందూపురం తపన సాహిత్య వేదిక వారి ఉత్తమ కథా పురస్కానికి ఎంపికైనట్లు సంస్థ వ్యవస్థాపకులు సడ్లపల్లె చిదంబరరెడ్డి పేర్కొన్నారు. మొట్టమొదటి పురస్కారం కర్నూలు రచయితకు వరించిందని తెలిపారు. ఐదు రాష్ట్రాల నుంచి 60 పుస్తకాలొచ్చాయని తెలిపారు. న్యాయనిర్ణేతలు అన్ని పుస్తకాలను నిశితంగా పరిశీలించి పురస్కారానికి ఊరిమర్లును ఎంపిక చేశారని పేర్కొన్నారు. పురస్కారం కింద రూ.10,000 నగదు, ప్రశంసా పత్రం ఇస్తామని తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో విద్యాశాఖ ఉద్యోగి



ప్రచారంలో పాల్గొన్న విద్యాశాఖ ఉద్యోగి

డోన్: విద్యాశాఖలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న దామోదర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం విస్మయానికి గురిచేస్తోంది. డోన్ ఎంఈఓ కార్యాలయంలో ఈయన పదేళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా సోమవారం ఉడుములపాడు, జగదుర్తి గ్రామాల్లో టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ.. ప్రచారంలో పాల్గొన్న దామోదర్‌రెడ్డిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

